
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప

జిల్లా వార్తలు

5

మంగళవారం 8 ఏప్రిల్ 2025



వేణుగానాలంకారంలో...

సీతారాముల కల్యాణానికి భారీగా ఏర్పాట్లు



బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి సీతాలక్ష్మణులతో కలిసి హంసవాహనంపై మాడ వీధులలో విహరిస్తున్న కోదండరాముడు

- పనులను పరిశీలించిన మంత్రులు ఆనం, సవిత, రాంప్రసాద్‌రెడ్డి
- ఉదయం వేణుగానాలంకారం.. రాత్రి హంసవాహనంపై రాముడి విహారం





ఆకట్టుకున్న కోలాటాలు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం టీటీడీ పరిపాలన సమావేశ భవనంలో కడప జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవిత, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేఈవో వీరబ్రహ్మం ఎస్పీ అశోక్‌కుమార్, జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈనెల 11న సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 121 గ్యాలరీల్లోకి సుమారు 80 వేల మంది భక్తులు వస్తారని, వారికి సంతృప్తికరంగా అన్న ప్రసాదాలను పంపిణీ చేస్తామని తెలిపారు. సుమారు 47,770 అన్న ప్రసాద ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నామని, సుమారు 150 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత మాట్లాడుతూ కల్యాణోత్సవానికి భక్తులతో పాటు అత్యంత ప్రముఖులు రావచ్చని సమాచారంతో అందుకు తగినట్లు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కల్యాణోత్సవానికి హాజరయ్యే భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా కల్యాణ వేదికను శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్ని రకాల వసతులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలన్నారు. ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు, పోలీసులు సమిష్టిగా కృషి చేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, సవిత, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలు కోదండరాముని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వీణా రాఘవాచార్యులు, శ్రావణ్‌కుమార్‌లు స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు.

అనంతరం కల్యాణవేదిక ప్రాంగణాన్ని పరిశీలించారు. కల్యాణ వేదికకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కడప, పులివెందుల ఆర్డీవోలు జాన్‌ఇర్విన్, చిన్నయ్య, డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, నాగరాజు, డీపీవో రాజ్యలక్ష్మి, పీఆర్ ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ రమణయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హంసవాహనంపై దశరథరాముడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి దశరథరాముడు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. సోమవారం ఉదయం శ్రీరామచంద్రుడు వేణుగానాలంకారంలో భక్తులకు అభయమిచ్చారు. స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తజన బృందాలు, చెక్కభజనలు, కోలాటాలతో స్వామి వారిని కీర్తిస్తుండగా మంగళ వాయిద్యాల నడుమ శ్రీరాముడిని ఊరేగిస్తూ కోలాహలంగా జరిగింది. ఉదయం 11 గంటలకు ఆలయంలో తిరుమంజన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాలు పెరుగు తేనె, చందనంతో స్వామివార్లకు అభిషేకం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, ఆలయ అధికారులు హనుమంతయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు ఘన స్వాగతం

రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, సవితలకు సోమవారం స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రులు బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలనకు ఒంటిమిట్టకు వచ్చిన సందర్భంగా రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య వారిని గజమాలతో సన్మానించారు. మంత్రులతో పాటు కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, ఎమ్మెల్సీలు బీదా రవిచంద్రయాదవ్, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేల్ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణవేదికను పరిశీలిస్తున్న మంత్రులు ఆనం, సవిత, మండిపల్లి, కలెక్టర్ శ్రీధర్ తదితరులు

అర్జీదారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



అర్జీలను పరిశీలిస్తున్న స్పెషల్ కలెక్టర్ వెంకటపతి

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు సమర్పించే బాధితుల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలనినీ స్పెషల్ కలెక్టర్ వెంకటపతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు పాల్గొని అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఆర్వో మాట్లాడుతూ ఫిర్యాదు దారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి స్వయంగా వెళ్లి సమస్యలను పరిశీలించాలన్నారు. పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు.

మద్దతు ధరతో జొన్నల కొనుగోలు

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): హైబ్రిడ్ జొన్నలను కనీస మద్దతు ధరతో కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జొన్నలు కనీస మద్దతు ధర క్వింటాలుకి రూ.3,371లుగా నిర్ణయించారని పేర్కొన్నారు. బద్వేలు, దువ్వూరు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు మండలాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో కొనుగోలుకు ఆదేశాలు జారీచేశామని తెలిపారు. ఈ-క్రాప్, ఈకేవైసీతో పాటు తమ పేర్లను నమోదు చేయించుకున్న రైతులు మాత్రమే కొనుగోలుకు అర్హులని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి జొన్నలు కొనుగోలు చేస్తామని, హమాలీ, రవాణా ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని వివరించారు. జొన్నలు కొనుగోలు చేసిన వెంటనే మద్దతు ధర మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.

క్యాంప్‌బెల్ వైద్యశాలకు నూతన సూపరింటెండెంట్ నియామకం

- నిరసన తెలిపిన ఆస్పత్రి సిబ్బంది



నిరసన తెలుపుతున్న క్యాంప్‌బెల్ వైద్యులకు సర్దిచెబుతున్న పోలీసులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు క్యాంప్‌బెల్ వైద్యశాల నూతన సూపరింటెండెంట్ నియామకం గందరగోళంగా మారింది. మెడికల్ సూపరింటెండెంట్ అగస్టిన్‌రాజును తొలగించి ఆయన స్థానంలో రవీంద్రను నియమించారు. ఈయన సోమవారం బాధ్యతలు చేపట్టేందుకు రావడం తో ఈ విషయం తెలిసింది. ఈయన నియామకాన్ని ఆస్పత్రి సిబ్బంది వ్యతిరేకి స్తూ నిరసన తెలిపారు. పెద్దఎత్తున జనం సైతం అక్కడకు చేరుకు న్నారు. దీంతో సీఐ లింగప్ప, ఎస్‌ఐలు రామక్రిష్ణ, లక్ష్మీనారాయణ, వారి సిబ్బంది అక్కడి కి చేరుకుని గొడవ జరగకుండా చూశారు. ఈ సందర్భంగా మాజీ మెడికల్ సూపరింటెండెంట్ అగస్టిన్‌రాజు తరుపున మెడికల్ బోర్డు మెంబర్, సీఎస్‌ఐ డివిజనల్ చైర్మన్ డానియేల్ విలేకరులతో మాట్లాడుతూ.. బిషప్ గుట్టుచప్పుడు కాకుండా నూతన మెడికల్ సూపరిండెంటెంట్ నియామకం చేశారన్నా రు. ఆయన నియంతలా మారాడని, కేవలం డబ్బుకోసమే అర్హత లేని వ్యక్తిని సూపరింటెండెంట్‌గా నియమించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎస్‌ఐ డయాసిస్ మెంబర్ విశ్వమోహన్, సీనియర్ పాస్టర్ దేవసహాయం మాట్లాడుతూ సీఎస్‌ఐ నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ సూపరింటెండెంట్ అగస్టిన్‌రాజును తొలగించి ఆయన స్థానంలో రవీంద్రను నియమించడం దారుణమన్నారు. జమ్మలమడుగు సీఎస్‌ఐ క్యాంప్‌బెల్ వవైద్యశాల సూపరింటెండెంట్ రవీంద్ర నియామకం చట్టవిరుద్ధమని సీఎస్‌ఐ సెంట్రల్ బోర్డు కార్యదర్శి రెవరెండ్ సాల్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా.. క్యాంప్‌బెల్ వైద్యశాలలో సోమవారం ఆస్పత్రి ఎదుట పలు ప్రాంతాలకు చెందిన పాస్టర్లు, డయాసిస్ ట్రెజరర్ మేరీ కుమార్, లీగల్ అడ్వైజర్ బాలు, మరికొందరు పుష్పగుచ్ఛం ఇచ్చి రవీంద్రను ఆశీర్వదించారు. అలాగే టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, బీజేపీ నాయకులు కొండాపురం ఇన్‌చార్జి దేవగుడి శివనారాయణరెడ్డి, సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేశారు. కొత్తగా నియామకం అయిన మెడికల్ సూపరింటెండెంట్ రవీంద్ర విలేకరులతో మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి, రోగులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషిచేస్తానని అన్నారు.

పార్టీ అధిష్ఠానమే సుప్రీం

- చంద్రబాబు చెప్పిన చోటే మహానాడు నిర్వహణ
- రాష్ట్ర అధ్యక్షుడికి స్పష్టం చేసిన జిల్లా ఎమ్మెల్యేలు, నేతలు



మహానాడు వేదికకోసం జిల్లా నేతలతో కలసి కడప శివారులో స్థల పరిశీలన చేస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తదితరులు

కడప, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): "కడపలో నిర్వహించే మహానాడు జిల్లాకే పరిమితమైనది కాదు.. వ్యక్తులకు సంబంధించినది కాదు.. ఇది పార్టీ కార్యక్రమం. అధిష్ఠానం ఎక్కడ నిర్వహించాలని చెబితే అక్కడే మహానాడు నిర్వహిద్దాం" అని జిల్లా టీడీపీ నేతలు, ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. వచ్చే నెలలో కడ పలో నిర్వహించనున్న మహానాడు వేదిక కోసం స్థల పరిశీలన చేసేందుకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఇన్‌చార్జి మంత్రి సవిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్త్యప్రసాద్, కాల్వ శ్రీనివాసులు, బీదా రవిచంద్ర కడపకు వచ్చారు. జిల్లా నుంచి పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, బద్వేలు సమన్వయకర్త రితీశ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, అమీర్‌బాబు, గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్ తదితరులు హాజరయ్యారు. వీరందరూ కలసి కడప ఎయిర్‌పోర్టు వద్ద ఉన్న అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి స్థలాన్ని, పులివెందుల రోడ్డులోని విజయగార్డెన్స్, ఎన్జీవో ప్లాట్లను పరిశీలించారు. స్థల పరిశీలన అనంతరం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ కడపలో మహానాడు నిర్వహించాలని టీడీపీ అధినేత నిర్ణయించారన్నారు. ఈ మేరకు స్థలాలను పరిశీలించామన్నారు. చంద్రబాబు, లోకేశ్‌లు టెక్నికల్ టీం ద్వారా ఫైనల్ చేస్తారని తెలిపారు. దానికి ముందు ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో నేతలతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడారు. స్థలం ఎంపిక అధిష్ఠానం తుది నిర్ణయమని చంద్రబాబు చెప్పిన చోటే మహానాడు నిర్వహిద్దామని టీడీపీ నేతలు ఆయనకు స్పష్టం చేశారు.

అమినిటీస్ సెక్రటరీ సస్పెన్షన్

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని బొల్లవరం 1వ వార్డు అమినిటీస్ సెక్రటరీ స్వరూప్‌కుమార్‌ను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సస్పెండ్ చేశారు. సోమవారం ఆమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. బొల్లవరం లేఅవుట్‌లో 123 ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారుల నుంచి వసూలు చేసిన డబ్బులు కాంట్రాక్టర్ ఎర్రమాసు శ్రీనుకు చెల్లించాల్సి ఉంది. అయితే నిబంధనలకు వ్యతిరేకంగా తన వద్ద కొంతకాలం ఉంచుకుని పలు దఫాలుగా చెల్లిస్తూ వచ్చాడు. కాంట్రాక్టర్ ఎర్రమాసు శ్రీనుకు అమినిటీస్ సెక్రటరీ స్వరూప్ కుమార్‌కు మధ్య రూ.27,18,153 డబ్బులు వివాదాస్పదంగా మారింది. కాంట్రాక్టర్ ఫిర్యాదు మేరకు ఈ డబ్బుల విషయమై మున్సిపల్ హౌసింగ్ అధికారులతో కమిటీ వేసి విచారణ చేపట్టి చర్యలు తీసుకున్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మృతి

- ఎదురెదురుగా కార్లు ఢీ కొనడంతో ఘటన



మృతి చెందిన సుగాలి రమ (ఫైల్ ఫొటో)

సంబేపల్లె/రాయచోటి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుగాలి రమ (56) సోమవారం ఉదయం కారులో వస్తుండగా ఎదురుగా అతి వేగంతో వచ్చిన కారు ఢీకొనడంతో ఆమె కారులోనే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. సుగాలి రమ పీలేరులో హంద్రీనీవా సుజల స్రవంతి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వస్తుండగా సంబేపల్లె మండలం ఎర్రగుంట్ల బస్టాప్ సమీపంలోకి రాగానే గల్ఫ్‌కు వెళ్లేందుకు రాయచోటి నుంచి చెన్నై వెళుతున్న కార్యు అతి వేగంగా వచ్చి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కారును ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సుగాలి రమ అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె కారు డ్రైవర్ ముబారక్, అటెండర్ జీరూనాయక్ మరో కారు డ్రైవర్ మణికంఠకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాసులు, రూరల్ సీఐ వరప్రసాద్, ట్రాఫిక్ సీఐ విశ్వనాధరెడ్డి, తహశీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని రోడ్డు ప్రమాదంపై ఆరా తీశారు. క్షతగాత్రులను వైద్యం కోసం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నివాళులర్పించిన మంత్రి మండిపల్లి

పీలేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ మృతి చెందడం చాలా బాధాకరమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం మంత్రి రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రమ మృతదేహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. అనంతరం గాయపడిన వారిని మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ నరసింహకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అహ్మద్‌బాషాకు 14 రోజుల రిమాండ్



అహ్మద్‌బాషాను రిమాండ్ నిమిత్తం కడప సెంట్రల్ జైలుకు తీసుకుపోతున్న పోలీసులు

కడప, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సోదరుడు అహ్మద్‌బాషాకు కడప రెండో అదనపు మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి భార్గవి 14 రోజులు రిమాండ్ విధించారు. ఈ మేరకు పోలీసులు అహ్మద్ బాషాను కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

వైసీపీ హయాంలో కడప నగరం వినాయకనగర్‌లో అహ్మద్‌బాషా మినిస్టర్ కాలనీ పేరుతో లేఅవుట్ వేశారు. ఆ లేఅవుట్‌కు ఆనుకుని ఉన్న జమీల్‌బాషా స్థలాన్ని ఆక్రమించుకుని రహదారి నిర్మాణాన్ని చేపట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య 2022 నవంబరు 11న ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా అహ్మద్‌బాషా చేసిన దాడిలో ముస్తాక్ అహ్మద్ అనే వ్యక్తి గాయపడ్డారు. ఈ మేరకు తాలూకా పోలీసుస్టేషనులో అహ్మద్‌బాషాపై 322, 326 సెక్షన్ల కింద క్రైం నెం.402/22తో నాన్‌బెయిలబుల్ కేసు పెట్టారు. అయినా అప్పట్లో పోలీసులు అహ్మద్‌బాషాను అరెస్టు చేయలేదు.

గత ఏడాది వైసీపీ అధికారం కోల్పోవడంతో పాటు కడపలో అంజద్‌బాషా ఎమ్మెల్యేగా ఓడిపోవడంతో అహ్మద్‌బాషా గల్ఫ్ వెళ్లిపోయి అక్కడ హోటల్స్ బిజినెస్ ప్రారంభించారు. ఇటీవల రంజాన్ పండుగకు కడపకు వచ్చిన ఆయన తిరిగి గల్ఫ్ వెళ్లేందుకు ముంబై చేరుకున్నారు. అహ్మద్‌బాషాపై అప్పటికే పోలీసులు లుక్‌అవుట్ నోటీసు జారీ చేశారు. దీంతో శనివారం రాత్రి ముంబై ఎయిర్‌పోర్టులో ఇమ్మిగ్రేషన్ అధికారులు అహ్మద్‌బాషాను అదుపులోకి తీసుకున్నారు. తాలూకా సీఐ వెంకటేశ్వర్లు, చిన్నచౌకు ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓ బృందం ముంబై వెళ్లి ఆయనను తీసుకుని ఆదివారం అర్ధరాత్రి బెంగళూరు విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడ నుంచి రోడ్డుమార్గాన సోమవారం కడపకు తీసుకువచ్చారు. అయితే పది వెహికల్స్‌లో అహ్మద్‌బాషా సంబంధీకులు పోలీసు వాహనాన్ని వెంబడించడంతో.. పోలీసులు రూటు మారుస్తూ కడపకు తీసుకువచ్చి రాజంపేట రోడ్డులోని పోలీసు ట్రైనింగ్ శిక్షణ కార్యాలయంలో అహ్మద్‌బాషాను ఉంచారు. అక్కడ కాసేపు విచారించాక తాలూకా పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసులో అరెస్టు చేసినట్లు వెల్లడించారు. అనంతరం రిమ్స్‌లో వైద్యపరీక్షలు నిర్వహించి రెండో అదనపు మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి ముందు హాజరుపరిచారు. అహ్మద్‌బాషా తరుపున మాజీ జీపీ నాగిరెడ్డి వాదనలు వినిపించగా పోలీసుల తరఫున ఏపీపీ శ్రీకాంత్ వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న జడ్జి భార్గవి 14 రోజులు రిమాండ్ విధించారు. అహ్మద్‌బాషా బెయిలు కోసం పిటిషను దాఖలు చేశారు. అయితే కేసు కొట్టేయాలంటూ అహ్మద్‌బాషా వర్గం హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.

అహ్మద్‌బాషాపై నమోదైన కేసులు ఇవే

ఎన్నికల కోడ్ ఉల్లంఘించి కడప నగరంలో రెండో గాంధి బొమ్మ వద్ద బాణసంచా పేల్చడంపై ఎన్నికల అధికారి ఫిర్యాదు మేరకు కడప వన్‌టౌన్‌లో అహ్మద్‌బాషాపై క్రైం నెం.189/24 ఐపీ సెక్షన్ 188, 266, రెడ్‌విత్ 34 కేసు నమోదైంది.

టూటౌన్ పోలీసుస్టేషన్ వద్ద ప్రస్తుత కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఆమె భర్త టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డిలను అసభ్య పదజాలంతో అహ్మద్‌బాషా దూషించారు. బెదిరింపులకు పాల్పడ్డారు. దీనిపై టూటౌన్‌లో క్రైం నెంబర్ 45/24తో కేసు నమోదయింది. ఇక ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ఓటర్లకు డబ్బులు పంచడంతో ఎన్నికల అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైం నెంబర్ 102/24తో ఇదే స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కడప మోచంపేటకు చెందిన ఆరిఫుల్లా కాళ్లు చేతులపై కొట్టడం, వేధించడంతో క్రైం నెంబర్ 49/24తో నమోదైన కేసులో అహ్మద్‌బాషా ఏ3గా ఉన్నారు. అలాగే చిలకలబావి వద్ద ఎన్నికల కోడ్ ఉల్లంఘించి జెండాల తో ప్రచారం చేయడంతో ఎన్నికల అధికారి ఆకుమల్ల రవి ఫిర్యాదు మేరకు 16/24 కింద కేసు నమోదైంది.

జిల్లా ప్రధాన జడ్జిగా యామిని

- పలువురు జడ్జిలు బదిలీ



కడప రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లా జడ్జిలను బదిలీ చేస్తూ సోమవారం హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా ప్రధాన జడ్జిగా సి.యామిని నియమితులయ్యారు. ఈమె నెల్లూరు జిల్లా ప్రధాన జడ్జిగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై రానున్నారు. కడప జిల్లా ప్రధాన జడ్జిగా పనిచేస్తున్న గొల్ల శ్రీదేవిని అనంతపురం జిల్లా లేబర్‌కోర్టుకు బదిలీ చేశారు. అలాగే జిల్లా కోర్టు సముదాయంలోని ఆరవ అదనపు జిల్లా కోర్టు(ఫ్యామిలీ కోర్టు) జడ్జిగా ఎన్.శాంతిని నియమించారు. ఈమె చిత్తూరు జిల్లా కోర్టులో ఆరవ అదనపు జిల్లా జడ్జి (పోక్సో కోర్టు)గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఆరవ అదనపు జిల్లా కోర్టు జడ్జిగా పనిచేస్తున్న ఇంతియాజ్ అహ్మద్‌ను విజయవాడలోని 14వ అదనపు జిల్లా కోర్టుకు బదిలీచేశారు.

కౌన్సిల్‌లో ఏక పక్ష నిర్ణయాలను రద్దు చేయాలి

● కలెక్టర్‌కు మున్సిపల్ కౌన్సిలర్ల ఫిర్యాదు



కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

కడప కలెక్టరేట్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు ఏకపక్షంగా చేసుకుంటూ ఏకపక్ష నిర్ణయాలను ఆమోదించుకుంటున్నారని, చట్టబద్ధత లేని కౌన్సిల్ మీటింగ్, నిర్ణయాలను రద్దు చేయాలని కౌన్సిలర్లు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ప్రొద్దుటూరు మున్సిపాలిటికి చెందిన కూటమి కౌన్సిలర్లు 18మంది ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇన్‌చార్జి డీఆర్వో వెంకటపతికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా 24వ వార్డు కౌన్సిలర్ కమాల్‌బాషా, మరికొందరు కౌన్సిలర్లు మాట్లాడుతూ గత నెల 22వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశానికి తమకు సమాచారం లేదని, అలాగే 24వ తేదీ నిర్వహించిన సమావేశానికీ తమకు సమాచారం లేదన్నారు. కమిషనరు హాజరు కాకుండానే ఇన్‌చార్జి కమిషనర్‌తో పలు అంశాలకు ఆమోదం తెలపడం చట్ట విరుద్ధమన్నారు. కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా నిర్వహించిన కౌన్సిల్‌ను, నిర్ణయాలను రద్దు చేయాలని కౌన్సిలర్లు వెంకటలక్ష్మి, మురళీధర్‌రెడ్డి, జిలాన్‌బాషా, అతిథిదేవి, వరలక్ష్మి, రమాదేవి, దీప్తి తదితరులు డిమాండ్ చేశారు.

చిత్రకళా ఉత్సవంలో వైవీయూ విద్యార్థుల ప్రతిభ

● మంత్రి నుంచి ప్రశంసలు



మంత్రి చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న వైవీయూ విద్యార్థి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో జరిగిన అమరావతి చిత్రకళా ఉత్సవంలో యోగివేమన విశ్వవిద్యాలయం లలిత కళా విభాగం విద్యార్థుల చిత్రాలు వీక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. ప్రతిభ చూపిన వైవీయూ బీఎఫ్ఏ విద్యార్థి డి.ముత్యంకు రాష్ట్ర టూరిజం సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శాలువ కప్పి అభినందించారు. ఈ ఉత్సవంలో విశ్వవిద్యాలయానికి చెందిన ముగ్గురు విద్యార్థులు దాదాపు రెండు వందల చిత్రాలను ప్రదర్శించారు. లలిత కళా విభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు, అధ్యాపకులు సి.హెచ్.వెంకటేష్, బి.ఈరప్ప, ప్రదర్శనలో మార్గదర్శకం వహించారు. అలాగే 5వ తేదీన విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, డ్రీం ఆర్ట్ గ్యాలరీ సంయుక్తంగా పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన పెయింటింగ్ వర్క్‌షాప్‌లో విద్యార్థులు దండు మేను ముత్యం, ఆర్.పునీత్ పాల్గొని ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విద్యార్థులను మెమెంటోలతో సత్కరించారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్టీపీపీ చోరీ కేసులో దొంగ అరెస్టు

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 7.(ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీలోని తాళాలు వేసి ఉన్న క్వార్టర్స్‌లో చోరీకి పాల్పడిన మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగల ముఠాను కలమల్ల పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం కొండాపురం సీఐ కలమల్ల పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బానిసై, డబ్బు సంపాదించాలన్న దురుద్దేశంతో మధ్యప్రదేశ్ థార్ జిల్లా కుక్షి తాలూకా నర్వాలి గ్రామానికి చెందిన గణపత్ ధావర్, మరో ముగ్గురితో కలిసి గ్యాంగ్‌గా ఏర్పడి ఏపీలోని కర్మాగారాల్లో, పెద్దపెద్ద అపార్టుమెంట్లలో తొంగతనాలకు పాల్పడేవాడన్నారు. 2025 ఫిబ్రవరి 9, 10వ తేదీల మధ్య రాత్రి సమయాల్లో ఆర్టీపీపీలోని కాలనీల్లో తాళాలు వేసివున్న ఇళ్లల్లో సుమారు రూ.2,40,000 విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారన్నారు. మళ్లీ చోరీలు చేసేందుకు ముద్దనూరు రోడ్డు కొత్తపల్లె క్రాస్ రోడ్డు వద్ద సంచరిస్తుండగా ధావర్‌ను కలమల్ల ఎస్ఐ తిమోతి ఆధ్వర్యంలోని పోలీసు బృందం అరెస్టు చేశారని, మరో ముగ్గురిని అరెస్టు చేయాల్సి వుందన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ తిమోతిని, సిబ్బందిని అభినందించారు.

దిగువ చెన్నామర్రి సమీపంలో రికార్డింగ్ డ్యాన్సులు

● డాన్సులకు వినియోగించిన వాహనం సీజ్

● ఇరువురిపై కేసు నమోదు

కురబలకోట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబల్లి పంచాయతీ దిగువ చెన్నామర్రి సమీనంలో రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించిన వాహనాన్ని సీజ్ చేసి, నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని ముదివేడు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దిగువచెన్నామర్రి గ్రామ సమీపంలోని చింతచెట్టు వద్ద డీజే సౌండ్ సిస్టమ్ పాటలతో హిజ్రాలతో అర్ధరాత్రిలో అర్ధనగ్న ప్రదర్శనలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. అనుమతులు లేకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంతో డీజే వాహనాన్ని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామన్నారు. అలాగే నిర్వాహకుడు ఎగువచెన్నామర్రికి చెందిన నాగరాజ కుమారుడు నరసింహులు(26), వాహన యజమాని తెట్టు పంచాయతీ పత్రవారిపల్లెకు చెందిన కుళ్ళాయప్ప కుమారుడు మహేష్(42)ను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

● జిల్లా వ్యవసాయాధికారి ఎ.నాగేశ్వర్‌రావు

పులివెందుల టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): భూమి కలిగిన ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం పులివెందుల, ముద్దనూరు వ్యవసాయ డివిజను పరిధిలోని 9 మండలాల వ్యవసాయాధికారులు, అలాగే రైతు సేవా కేంద్రాల సిబ్బందితో స్థానిక ఎంపీడీవో సభాభవనంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేయడం జరుగుతుందన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ రైతులకు కావాలసిన నాణ్యమైన ఎరువులు, విత్తనాలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో పులివెందుల సహాయ వ్యవసాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెన్నా నదిలో పడి వృద్ధుడి మృతి

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పెన్నానదిలో స్నానానికి దిగి ఈత రాక ఒక వృద్ధుడు మృతి చెందిన సంఘటన ప్రొద్దుటూరులో జరిగింది. ఆ వివరాల్లోకి వెళితే.. రామేశ్వరానికి చెందిన చిన్న వెంకటేష్ (73) మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి కనబడకుండా పోయి సోమవారం పెన్నానదిలో శవమై తేలాడు. రూరల్ పోలీసులు నదిలో తేలిన శవాన్ని పైకి తీశారు. చిన్న వెంకటేష్ ప్రతి రోజు గంగమ్మ దేవళం వద్ద వున్న పెన్నానదిలో స్నానం చేసి వెళుతుండేవాడని, నదిలో లోతు ఎక్కువగా వున్నచోట దిగి ఈత రాక మునిగిపోయి మరణించాడని పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసాంఘిక శక్తులపై నిఘా నేత్రం..

● నేత్ర సంచార వాహనంతో నేరస్తులను గుర్తించే అవకాశాలు

● అందుబాటులో అత్యాధునిక సీసీ కెమెరాలు

ప్రజారక్షణలో భాగంగా నూతనంగా ఏర్పాటైన నేత్రవాహనం ఉన్న చోట ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ఏదైనా గొడవలు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, దొంగతనాలకు పాల్పడినా ఈ నిఘా నేత్రం వారిని ఇట్టే పట్టిస్తుంది. స్పష్టమైన వీడియోల ద్వారా వారిని గుర్తించి నిమిషాల్లో అక్కడున్న పోలీసులకు నేత్ర బృందం సమాచారమిస్తారు. దీంతో నిందితులను నిమిషాల్లోనే పట్టుకుంటారు. ఈ వాహనం వినియోగం వలన నేరాలు తగ్గే అవకాశం ఉందని పోలీసు అధికారులు చెబుతున్నారు.



వాహనంలో సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్న సిబ్బంది

నిఘా నేత్ర వాహనం



కడప క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా సభలు, సమావేశాలు, తిరునాళ్లు, జాతరలు, సీఎం, మంత్రులు.. ఇతర నాయకుల సభల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచేందుకు కడపలో నిఘా నేత్ర సంచార వాహనాన్ని ఏర్పాటు చేశారు. 2017లో ఈ వాహనాన్ని ప్రారంభించారు. అయితే వాహనం కొన్ని రోజులు బాగా ఉపయోగించుకున్న అధికారులు తర్వాత ఆ వాహన వినియోగం కనుమరుగైంది. ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ బాధ్యతలు తీసుకున్న అనంతరం ఈ వాహనంపై ప్రత్యేక దృష్టి సారించారు. మరమ్మతులు చేయించడంతో పాటు అత్యాధునిక పరికరాలు, కెమెరాలతో మానిటరింగ్ చేసే విధంగా నూతనంగా ఏర్పాటు చేశారు. ట్రయల్‌గా శివరాత్రికి, పొలతల పుణ్యక్షేత్రాల్లో ఈ వాహనంతో నిఘా ఉంచారు. జేబు దొంగలు, అల్లరిమూకలు, జూదం, చైన్‌స్నాచర్లతో పాటు అనుమానాస్పదంగా తిరిగే వారిని ఈ కెమెరాల ద్వారా గుర్తించగలరు. నిందితులను గుర్తించేలా 360 డిగ్రీలు తిరిగే కోణంలో 200 మీటర్ల దూరాన్ని స్పష్టంగా చూపగలిగే పీటీజెడ్ కెమెరాలతో పాటు డ్రోన్ కెమెరాను ఏర్పాటు చేశారు. దీంతో పాటు వాహనం చుట్టూ నాలుగు దిక్కులలో కెమెరాలను ఏర్పాటు చేశారు. దాదాపు 200 మీటర్ల దూరంలో మనిషితో పాటు చిన్నపాటి అక్షరాలను సైతం క్యాప్చర్ చేయగల సత్తా ఉన్న కెమెరాలను ఏర్పాటు చేశారు. జనాల మధ్యలో ఈ కెమెరాలను పెట్టి దొంగలను, నేరాలకు పాల్పడే వారిని ఇట్టే గుర్తించే అవకాశం ఉంది.

శ్రీరాముని కల్యాణం సందర్భంగా..

ఒంటిమిట్టలో జరగనున్న కల్యాణ మహోత్సవానికి ముఖ్యమంత్రితో పాటు పలువురు నాయకులు, పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతారు. కల్యాణ ప్రాంగణంలో ఎలాంటి ఘటనలు జరగకుండా ఈ వాహనంతో నిఘా ఉంచనున్నారు. ఏదైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కెమెరాలే అల్లరి మూకలను పట్టిస్తాయి.

ఒక కెమెరా.. వంద మంది పోలీసులతో సమానం

ఒక సీసీ కెమెరా.. వంద మంది పోలీసులతో సమానంగా పనిచేస్తుంది. జనాల మధ్యలో నేరస్తులు ఏం చేసినా చిత్రీకరిస్తుంది. దానిని పరిశీలించి వారిని నిమిషాల్లో అదుపులోకి తీసుకునే అవకాశం ఉంటుంది. మనిషి అయినా ఏమరుపాటుగా ఉన్నా నిఘా నేత్రం మాత్రం దాని పరిధిలో ఉన్న వారిని ఒక కంట కనిపెడుతూ తప్పు చేసేవారిని పట్టిస్తుంది.

నేత్ర వాహనం ప్రత్యేకతలు

ఫోర్ ఫిక్స్‌డ్ ఇంటర్నెట్ ప్రోటోకాల్ కెమెరాస్, 1 పీపీజెడ్ కెమెరా (360 డిగ్రీలు), 200 మీటర్ల వరకు చూడగలరు. 16 ఛానెల్స్ నెట్‌వర్క్, వీడియో రికార్డర్, వైర్‌లెస్ కెమెరా, ఆర్ బాడీవార్న్ కెమెరాస్, డ్రోన్ కెమెరా, ఈహెచ్‌ఎఫ్ సెట్ ఫర్ కమ్యూనికేషన్ సిస్టం, రెండు సీసీ టీవీ మానిటర్స్, అలాగే పబ్లిక్ అడ్రస్‌సిస్టం, సైరెన్, జనరేటర్, ఎలక్ట్రికల్ సిస్టం, 24/7 మానిటరింగ్ బై స్పెషలిస్ట్ ఆపరేటర్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ వాహనం ఎక్కువ జనాలు సంచరించే ప్రాంతాల్లో నిఘా ఉంచి జనాల కదలికలను పరిశీలిస్తుంటారు.



వైసీపీ వంచించింది.. కూటమి అండగా నిలిచింది

● ముదివేడు రిజర్వాయర్ భూ బాధితులకు రూ.1.66కోట్లు నష్టపరిహారం ● తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రైతులను వంచించి నష్టపరిహారం చెల్లించకుండా భూములు లాక్కొని దౌర్జన్యంగా ముదివేడు రిజర్వాయర్ పనులు చేపడితే.. కూటమి ప్రభుత్వం ఇప్పుడు నష్టపరిహారం చెల్లించి రైతులకు అండగా నిలుస్తోందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువులో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ముదివేడు రిజర్వాయర్ పనుల కోసం రైతుల నుంచి 750 ఎకరాలు సేకరించి నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డికి చెందిన కంపెనీ కొత్తపల్లె, శీతవారిపల్లె, గురికివారిపల్లె, పిచ్చలవారిపల్లె గ్రామాల రైతుల భూములను బలవంతంగా లాక్కొని పనులు చేపట్టిందన్నారు. ఎక్కడైనా పనులు జరిగితే ముందుగా రైతులకు నష్టపరిహారం ఇచ్చి పనులు ప్రారంభిస్తారని, ఇక్కడ మాత్రం రైతులకు వైసీపీ ప్రభుత్వం చిల్లి గవ్వఇవ్వకుండా పనులు చేపట్టి రైతులను నిలువునా ముంచిందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబునాయుడు కురబలకోట మండలం అంగళ్ళుకు వచ్చినప్పుడు రైతులు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఈ విషయాన్ని జిల్లా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి జనార్ధన్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ మంత్రి రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి 25 మంది రైతులకు మొదటి విడతగా రూ.1.66 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసిందన్నారు. మిగిలిన రైతులకు కూడా త్వరలోనే పరిహారం అందుతుందన్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటగా తంబళ్లపల్లె నియోజకవర్గ రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం విడుదల చేసిందన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం అందించే ముదివేడు రిజర్వాయర్ పనులు ప్రారంభిస్తామన్నారు. రైతుల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం ముదివేడు రైతులకు అండగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జున నాయుడు, కురబలకోట మండల పార్టీ కన్వీనర్ వైజీ సురేంద్రయాదవ్, నాయకులు జనార్ధన్‌రెడ్డి, సుబ్బినాయుడు, ఫజులు, శంకర్‌రెడ్డి, ఎర్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాల పోస్టర్లు విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

బద్వేలుటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠంలోని జగద్గురు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలకు సంబంధించి వాల్‌పోస్టర్లను సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విడుదల చేశారు. ఈ ఆరాధనోత్సవాలు మే నెల 4వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌రెడ్డి, దేవదాయశాఖ అధికారులు, పురోహితులు పాల్గొన్నారు.

బిషప్ పాల్‌ప్రకాశ్ పట్టాభిషేకానికి తరలిరండి

● కడప మేత్రాసన ప్రతినిధులు



కడప కల్చరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మరియాపురం డయాసిస్ నూతన బిషప్‌గా సగినాల పాల్ ప్రకాశ్ ఈనెల 9న పట్టాభిషిక్తులు కానున్నారని, ఈ పట్టాభిషేకానికి విశ్వాసులు తరలిరావాలని కడప మేత్రాసన వికర్ జనరల్ బాలరాజు, కోశాధికారి ఫాదర్ సురేశ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మరియాపురంలోని బిషప్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ మహోత్సవం మరియాపురం సెయింట్ జోసెఫ్ బాలుర పాఠశాల ప్రాంగణంలోని అరులయ్య వేదికపై జరగనుందన్నారు. ఈ మహోత్సవానికి ముఖ్యఅతిథులుగా వాటికన్ నుండి దూత లియో పోల్డ్ జిరెల్లితో పాటు ప్రధాన అభిషేక పీఠాధిపతిగా హైదరాబాదు మేత్రాసనానికి చెందిన పూల ఆంథోని, సహాయ అభిషేక పీఠాధిపతులుగా గాలిబాలి, నెల్లూరు బిషప్ మోసెస్ డి.ప్రకాశం పాల్గొంటారన్నారు. ముఖ్య ప్రసంగీకులుగా విజయవాడ మేత్రాసన పీఠాధిపతి జోసెఫ్ రాజారావు, ఏపీ, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుండి సుమారు 20 మంది బిషప్‌లు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతి విచారణ గురువు ఆనంద్, ఎర్రగుంట్ల విచారణ గురువు మోజెస్ పాల్గొన్నారు.

పెద్దదర్గాను సందర్శించిన హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి

కడప కల్చరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత పెద్దదర్గాను సోమవారం హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి అహ్మద్ అక్బర్ దర్శించుకున్నారు. దర్గాకు చేరుకున్న ఆయనకు దర్గా ప్రతినిధులు సంప్రదాయబద్ధంగా ఆయనకు స్వాగతం పలికారు. దర్గాలోని గురువుల మజార్లను దర్శించిన అనంతరం ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువుల పిలుపుతోనే తాను ఈ ప్రాంతానికి చేరుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకుడు శాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.



కోదండరాముడి సన్నిధిలో పల్లా



ఒంటిమిట్ట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయాన్ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొమరా వెంకటన రసయ్య, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, మండల నాయకులు మామిళ్ల ఈశ్వరయ్య, పత్తి సుబ్బరాయుడు, ఆర్.వి.లోకేశ్, గిరీశ్‌కుమార్, చలమయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'దైవ కృపతో జిల్లాకు ఢిల్లీస్థాయిలో ఖ్యాతి'

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దైవ కృపతో జిల్లా ఖ్యాతి ఢిల్లీస్థాయిలో ప్రకాశించాలని ప్రకాష్‌నగర్ జీసస్ బ్లెస్సింగ్స్ చర్చి పాస్టర్ ఎస్.విజయ్‌కిషోర్ అన్నారు. సోమవారం చర్చి ఆవరణలో ఇటీవల ఇంటాక్ జాతీయ స్థాయి గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా అధిక మెజారిటీతో గెలుపొందిన ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలోని ఇంటాక్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు గౌరవం సాధించడంలో చిన్నపరెడ్డికి దేవుని ఆశీస్సులు దండిగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా పాస్టర్ ఎస్.విజయ్‌కిషోర్‌తో పాటు చర్చి, జేఏసీ సభ్యులు చిన్నపరెడ్డిని ఘనంగా సత్కరించారు. స్థానిక పెద్దలు, చర్చి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నపరెడ్డిని సత్కరిస్తున్న చర్చి ప్రతినిధులు

నుజ్జు అయిన బస్సు ముందు భాగం



తప్పిన ప్రమాదం

దువ్వూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం పుల్లారెడ్డిపేట సమీపంలోని నాలుగు రోడ్ల కూడలిలో సోమవారం లారీని వెనుక నుంచి ట్రావెల్స్ బస్సు ఢీకొంది. పాండిచ్చేరి నుంచి హైదరాబాదు వెళుతున్న బస్సు ఇనుపపైపుల లోడుతో నిలబడి ఉన్న లారీని ఢీకొంది. బస్సు డ్రైవర్ లారీని తప్పించే ప్రయత్నంలో స్టీరింగ్ తిప్పగా రోడ్డును దాటుకుని పొలాల్లోకి వెళ్లింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం నుజ్జు అయింది. అందులో ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ విషయమై ఎస్ఐ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన మాట వాస్తవమేనని, ఫిర్యాదు రాకపోవడంతో కేసు నమోదు కాలేదని చెప్పారు.

జూదరుల అరెస్టు

● 70,620 నగదు, పది ద్విచక్ర వాహనాలు స్వాధీనం

కలకడ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవళపల్లె పంచాయితీ బొజ్జగుంటపల్లె గోళ్లచెరువు సమీపంలో జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ మల్లికార్జున తెలిపారు. పట్టుబడిన నిందితుల నుంచి 70620 నగదు, పది ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే మరికొందరు పారిపోయినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది శ్రీనివాసులు, రమేష్‌బాబు, రామ్‌మోహన్, భద్రయ్య పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో ఐదుగురు..

తంబళ్లపల్లె, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15,860 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ లోకేశ్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్నగారిపల్లె పంచాయతీ చింతలరేవుపల్లెకు సమీపంలోని తిరగరాళ్లగుట్టలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేశామన్నారు. ఈ దాడుల్లో ఐదుగురిని పట్టుకోగా, ఎనిమిది మంది పారిపోయినట్లు తెలి పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీపీ నేతకు బెదిరింపు కాల్

● కేసు నమోదు

చెన్నూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డిని చంపుతామంటూ గుర్తు తెలియని వ్యక్తి ఫోనులో బెదిరించిన విషయంపై కేసు నమోదు చేసినట్లు చెన్నూరు పోలీసులు తెలిపారు. గత నెల 23వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఫోనులో పదే పదే హెచ్చరిస్తూ బెదిరించడంతో స్థానిక పోలీసుస్టేషన్‌లో విజయభాస్కర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రైవేటు ఉపాధ్యాయులకు వేతనం ఇవ్వాలి

కడప నాగరాజుపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థలలో పనిచేస్తున్న అధ్యాపకులకు 12 నెలల వేతనం చెల్లించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి డీఆర్‌ఓకు వినతిపత్రం సమర్పించారు.

ఊరి బడిని దూరం చేయొద్దు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన జీఓ నెంబర్ 117, 128 వల్ల కుదేలైన ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థను కాపాడడానికి ఈ ప్రభుత్వం చొరవ చూపాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు కోరారు. సోమవారం కడప నగరం రాష్ట్ర అతిథి గృహంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కరీముల్లా, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుపై ఐదు శాతం రాయితీ

పులివెందుల టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల పురపాలక సంబంధించి ఇంటి పన్నులు, ఖాళీ జాగా పన్నులపై 5 శాతం రాయితీ పొందవచ్చని మున్సిపల్ కమిషనరు రాముడు తెలిపారు. సోమవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతూ భవన యజమానులు, ఖాళీస్థల యజమానులకు 2025-26 సంవత్సరానికి చెల్లించవలసిన ఇంటి పన్నులు ఖాళీ జాగా పన్నులు ఏక మొత్తంలో చెల్లించి 5 శాతం రాయితీ పొందేందుకు జీవో నెం.267, తేది 30.4.25లోపు చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. పన్నులు చెల్లించేవారు పురపాలక సంఘ కార్యాలయ కౌంటరు, వార్డు సచివాలయం, ఆన్‌లైన్, పురమిత్ర యాప్‌లో పన్నులు చెల్లించాలని ఆయన కోరారు.

ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం

పెండ్లిమర్రి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యమని నందిమండలం పీహెచ్‌సీ వైద్యుడు వినయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పద్మవ్యూహం..!

- అష్టదిగ్బంధంలో పెద్ద మార్కెట్
- రోడ్లపైనే వ్యాపారం
- దుకాణాల ముందే తోపుడు బండ్లు
- లోపలకు వెళ్తే బయటకు రావడం కష్టమే
- అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్
- కొనుగోలుదారులకు తప్పని అవస్థలు



రోడ్డుపైనే అడ్డదిడ్డంగా ఉన్న ద్విచక్రవాహనాలు

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పెద్ద మార్కెట్ జిల్లాలోనే అతిపెద్దది. కొన్ని దశాబ్దాల కిందట ఏర్పాటైన ఈ మార్కెట్‌కు నగరవాసులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలు కాయగూరలు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు వస్తుంటారు. ప్రతి రోజు లక్షలాది రూపాయల వ్యాపారం జరుగుతుంది. అయితే రోడ్లపైనే వ్యాపారాలు, దుకాణాల ముందే తోపుడు బండ్లు, అక్కడే వాహనాల పార్కింగ్ ఆ మార్కెట్‌ను అష్టదిగ్బంధం చేస్తున్నారు. కనీసం నడిచే మార్గం కూడా ఉండడం లేదు. దీంతో లోపలకు వెళ్లేవారు బయటకు వచ్చేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అయినా నగరపాలక అధికారులకు పట్టడం లేదు.

పట్టించుకోని అధికారులు, పోలీసులు..:

పెద్దమార్కెట్‌లో రద్దీ కారణంగా నిరంతరం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంటుంది. దీనిపై ఎప్పుడైన ఉన్నతాధికారులు చర్చించినపుడు, లేదా ఆ ప్రాంతంలో ఏదైన సంఘటన జరిగినపుడు తప్ప పోలీసులు మార్కెట్ వైపు దృష్టిసారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. నగరపాలక సంస్థ అధికారులు సైతం తమకు పట్టనట్లే వ్యవహరిస్తున్నారు.

దుకాణాలు వదిలేసి రోడ్లపై వ్యాపారాలు

నగరపాలక సంస్థ అధికారులు కోట్ల రూపాయల వ్యయంతో మార్కెట్‌లో దుకాణాలు నిర్మించి వ్యాపారులకు ఇచ్చారు. అయితే వ్యాపారులు మాత్రం దుకాణాల్లో కాకుండా రోడ్లపై వ్యాపారం చేస్తున్నారు. రోడ్లపై నడిచేందుకు కూడా దారి లేకుండా చేస్తున్నారు. పెద్ద మార్కెట్‌లోకి వెళ్లాలంటే పలు మార్గాలు ఉన్నాయి. అయితే ఈ మార్గాలను దుకాణదారులు బ్లాక్ చేస్తున్నారు. బయట బండ్లపై వ్యాపారాలు సాగిస్తున్నారు. దీనికి తోడు తోపుడు బండ్లను సైతం రోడ్లకు ఇరువైపులా నిలిపేసి కాయగూరలు, పండ్లు విక్రయిస్తున్నారు. దీంతో మార్కెట్‌లోకి వెళ్లి



వచ్చేందుకు దారి లేక కొనుగోలుదారులు అవస్థలు పడుతున్నారు. మరోపక్క పెద్ద మార్కెట్‌లో సెంటర్ పార్కింగ్‌ను ఏర్పాటుచేశారు. అయితే మార్కెట్‌కు వచ్చేవారంతా తమ వాహనాలను ఎక్కడపడితే అక్కడే నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.



ఇష్టారాజ్యంగా రోడ్డుకు అడ్డంగా ఉన్న ఆటోలు

ఇన్‌చార్జి మంత్రి సవితకు ఘన స్వాగతం

నేడు పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి



ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మాట్లాడుతున్న సవిత

పులివెందుల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితకు తుంగభద్ర కెనాల్ ప్రాజెక్టు చైర్మన్ జోగిరెడ్డి, ఆర్డీవో చిన్నయ్య ఘనస్వాగతం పలికారు. సోమవారం రాత్రి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో నాయకులు అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పలు అంశాలపై వారితో చర్చించారు. కాగా మంగళవారం ఉదయం 10గంటలకు పులివెందులలోని ఓ ఫంక్షన్ హాల్‌లో టీడీపీ విస్తృత స్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి మంత్రి హాజరుకానున్నారు. మంత్రి పులివెందులకు రానుండడంపై ఈ ప్రాంత రైతాంగం ప్రజలు ఆమె ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. పులివెందుల నియోజకవర్గంలో వైసీపీ హయాంలో చేపట్టిన అనేక అభివృద్ధి పనులు ఆగిపోయాయి. వీటన్నింటి పూర్తికి జిల్లా మంత్రి కట్టుబడి ఉంటారా లేక మాటలతో సరిపెడతారా అని ఈ ప్రాంత ప్రజలు చర్చించు కుంటున్నారు. పులివెందుల నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పులివెందులకు రావడం వీటిపై ప్రజల్లో చర్చ సాగే పరిస్థితి నెలకొంది. అలాగే ఇటీవల గాలివాన బీభత్సానికి వేల ఎకరాల్లో అరటి పంట దెబ్బతింది. ఈ నష్టపరిహారం మంత్రి ఏమైనా ప్రకటిస్తారా అని ఎదురుచూస్తున్నారు.

ఎన్టీఆర్ వైద్యానికి బకాయిలు చెల్లించాలి

ఎన్.డి.విజయజ్యోతి



కడప కలెక్టరేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఆరోగ్యదినోత్సవం రోజునే రాష్ట్రంలో బకాయిలు చెల్లించని కారణంగా ఎన్టీఆర్ వైద్య సేవలు ఆగడం పేదలకు ఆరోగ్య భద్రత లేకుండా పోయిందని, వెంటనే బకాయిలు చెల్లించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రులకు పెండింగ్ బకాయిలు చెల్లించని కారణంగా ఎన్టీఆర్ వైద్య సేవలు పేదలకు అందించలేమని స్పెషా లిటీ ఆసుపత్రుల అసోషియేషన్ ప్రకటించిందన్నారు. రూ. 3500 కోట్లు బకాయిల విషయంలో మొండికి దిగడం చూస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిందా? అని ప్రశ్నించారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివమోహన్ రెడ్డి, సయ్యద్ గౌస్ పీర్, ప్రసాద్ గౌడ్, మామిళ్ల బాబు, రఫీక్ ఖాన్, నరసింహులు, పాలగిరి శివ, శ్యామలమ్మ, మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'మహానాడు విజయవంతానికి కృషి చేస్తాం'



మంత్రులను కలిసిన కమలాపురం టీడీపీ నాయకులు

కమలాపురం రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కడపలో మే నెలలో జరిగే మహానాడును విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా తెలిపారు. సోమవారం మహానాడు సభకు స్థల పరిశీలన కోసం కడపకు వచ్చిన రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లాశ్రీనివాస్ యాదవ్‌ను కమలాపురం ఎమ్మెల్యే పుత్తాచైతన్యరెడ్డితో పాటు కలిసి జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఖాదర్‌బాషా, రెడ్డికరీం, అజ్మతుల్లా ,మాలేపాటి మల్లికార్జునశెట్టి కలిసి శాలువా, బొకేలతో సత్కరించారు.

ఉర్దూ స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రోష్ని స్కీం పునఃప్రారంభించి ఉర్దూ స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ మునాఫ్ ప్రకటనలో డిమాండ్ చేశారు. 1997 సంవత్సరంలో సీఎం చంద్రబాబు స్పెషల్ ఉర్దూ డీఎస్సీ నిర్వహించి దాదాపు 1000 ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారన్నారు. 2025 సంవత్సరంలో మెగా డీఎస్సీలో భాగంగా స్పెషల్ ఉర్దూ డీఎస్సీ నిర్వహించి ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు.

సరస్వతి దేవి విగ్రహం ఏర్పాటు

సింహాద్రిపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గురిజాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం సరస్వతీ దేవి విగ్రహాన్ని పూర్వపు విద్యార్థులు ఏర్పాటు చేశారు. ఇదే పాఠశాలలో 2008-2009 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 54 మంది సమారు రూ.50వేలు ఖర్చు చేసి విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు విగ్రహం ఏర్పాటు చేసిన వారికి అభినందనలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తప్పదు : సీపీఎం

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కడప నగర ప్రజానీకం ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల పరిష్కారం కోసం సోమవారం కడపమున్సిపల్ కార్పొరేషన్ ఎదుట సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించింది. ఈ ఆందోళన ఉద్దేశించి సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ మాట్లాడుతూ కడప నగరాన్ని అభివృద్ధి పేరుతో పెద్దఎత్తున నిధులు తీసుకొస్తున్నామని పాలకులు చెప్పినమాటలు సామాన్య ప్రజానీకానికి ఏమాత్రం ఉపయోగపడే స్థితిలో లేవని ఆయన విమర్శించారు. నగర శివారు ప్రాంతాలు రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా, వీధిలైట్లు తదితర సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నార న్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఎం నాయకులు దస్తగిరిరెడ్డి,మహిళా సంఘం నాయకులు ఐఎన్ సుబ్బమ్మ,జమీల, సరిత, కామేశ్వరమ్మ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎం సాయం



ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య రక్షణకు రోగపీడితుల వైద్యచికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఉదారంగా ఆర్థికసాయం అందిస్తున్నారని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి తెలిపారు. వేంపల్లెలోని సంగం వీధిలో క్యాన్సర్ బాధితుడు నామా శ్రీనివాసులుకు వైద్య చికిత్స కోసం మంజూరైన రూ.5లక్షల ఎల్‌ఓసీ ధృవీకరణ పత్రాన్ని సోమవారం లబ్ధిదారునికి ఇంటికి వెళ్లి ఎమ్మెల్సీ అందజేశారు. అనంతరం శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో కలిసి సీఎం చంద్రబాబుచిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ బీటెక్ రవి, తాను కలిసి ఇప్పటికే పులివెందుల నియోజకవర్గంలో రూ.10కోట్ల మేర వైద్య చికిత్సల కోసం బాధితులకు ఆర్థికసాయం చెక్కులు అందంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు జీవి రమణ, పట్టణ అధ్యక్షుడు ఆర్వీ రమేష్, మాజీ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, మైసూరారెడ్డి, పోతిరెడ్డి శివ, భానుకిరణ్ పాల్గొన్నారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనలు

కడప కల్చరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని హిందూ ధర్మ ప్రచార పరిషత్ టీటీడీసౌజన్యంతో కడప శిల్పారామంలో ఈ నెల 7వతేదీ నుంచి 10వతే దీ వరకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 8 వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయి. సోమవారం అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం పరిపాలనాధికారి క్రిష్ణప్రసాద్, ఫీల్డ్ సూపర్‌వైజరు మధుసూదన్‌బాబు పాల్గొన్నారు.



పులివెందుల అర్బన్ సీఐగా చాంద్‌బాష



పులివెందుల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పులివెందుల అర్బన్ సీఐగా చాంద్‌బాష సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ నరసింహులు వేంపల్లె సీఐగా బదిలీపై వెళ్లారు. కడప సీసీఎస్-2లో పనిచేస్తున్న చాంద్‌బాషను పులివెందుల అర్బన్ సీఐగా బదిలీ చేయడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు.

వేంపల్లె సీఐగా నరసింహులు



వేంపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె సీఐగా నరసింహులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పులివెందులలో పని చేస్తున్న ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం కృషిచేస్తానని నూతన సీఐ తెలిపారు. కాగా ఇక్కడ పనిచేసిన సీఐ సురేష్‌రెడ్డి కడప వీఆర్‌కు బదిలీ అయ్యారు.

కడప తాలూకా ఎస్ఐగా తులసి నాగప్రసాద్



కడప క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : కడప తాలూకా పోలీసుస్టేషన్ ఎస్ఐగా తులసి నాగప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2011 బ్యాచ్‌కు చెందిన ఈయన ఎస్ఐగా జిల్లాలో పలు పోలీసుస్టేషన్లలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం సింహాద్రిపురం నుంచి బదిలీ అయి కడప తాలూకాకు వచ్చారు.

యువతి అదృశ్యం

పులివెందుల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పరిధిలోని మల్లికార్జున పురానికి చెందిన షేక్ కుషాలమ్మ (19) అనే యువతి ఆదివారం రాత్రి అదృశ్యమైంది. సోమవారం కుషాలమ్మ తల్లి హిమాంబి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పులివెందుల అర్బన్ సీఐ చాంద్‌బాష తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి షేక్ కుషాలమ్మ కనబడ లేదని వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తాగునీళ్లు లేవు

వేంపల్లె, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పంచాయతీ పరిధిలో ప్రజలు తాగునీటికి కటకటలాడుతున్నారు. రెడ్డయ్య కాలనీలో రెండు వారాలుగా నీళ్లు రావడం లేదంటూ ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి వస్తున్న విషయాన్ని తెలుసుకొని మహిళలు నీటి సమస్యను చెప్పుకొన్నారు నీళ్లు రాకపోతే ఏం తాగాలంటూ మొరపెట్టుకున్నారు. దీనితో పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందితో మాట్లాడి వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని నాయకులకు పురమాయించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు జీవీ రమణ మహిళలకు నీటి సరఫరా చేయంచారు. కాగా నీటి సమస్య ఉందన్న విషయం సర్పంచు ఆర్.శ్రీను దృష్టికి వెళ్లడంతో వెంటనే ట్యాంకర్లను కాలనీకి పంపించారు. దళితనాయకులు కమతం రాజా ప్రజలందరికి నీరు అందేలా చర్యలు తీసుకున్నారు.

డప్పులతో నిరసన

చక్రాయపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేటలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సురభి గ్రామం దళితవాడకు చెందిన ప్రజలు డప్పులు వాయిస్తూ నిరసన వ్యక్తం చేశారు. సురభి గ్రామం హరిజనవాడకు చెందిన ప్రజలకు సర్వే నెంబర్ 239లో 4.05ఎకరాల భూమి ఉంది. ఈ భూమి అప్పటి ప్రభుత్వం 1989లో మాదిగలకు పంపిణీ చేసి పటా కూడా చేశారు. అయితే ఆ పట్టాభూమి ఊరివిండి సుబ్బయ్య తండ్రి రామయ్య, సుబ్బయ్య తల్లి పక్కీరమ్మ పేరుతో నమోదైంది. కానీ వారికి ఎటువంటి ఆధారాలు లేవు. కానీ ఆన్‌లైన్‌లో ఎక్కి ఉంది. మాకు పట్టా ఉండి,అనుభవంలో ఉండి భూమి మాత్రం వారి పేర్లతో ఉంది. ఇది న్యాయమేనా అంటూ డప్పులు కొట్టుకుంటూ నిరసన వ్యక్తం చేశారు.

ఆత్మలు ఘోషిస్తున్నాయి..!

- అంతిమ సంస్కారానికి తప్పని అవస్థలు
- జాడలేని కనీస సదుపాయాలు
- ఎమ్మెల్యే చెప్పినా చలనం లేని యంత్రాంగం



చెన్నమరాజుపల్లెలో రోడ్డుపక్కన కనీస సౌకర్యాలకు నోచుకోని శ్మశాన వాటిక

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కోటీశ్వరుడైనా... కూలి అయినా... చనిపోయాక మృతదేహాన్ని ఖననం చేయడానికి ఆరు అడుగుల స్థలం కావాల్సిందే. ఒక వ్యక్తి చనిపోయినప్పుడు ఆ స్థలాన్ని వెతుకోవాల్సిన దుస్థితి నెలకొనడం అందరిని వేధిస్తోంది. . అంత్యక్రియలు చేసేందుకు వెళ్లాలన్నా అంతిమ కష్టాలు వెంటాడుతున్నాయి. దీంతో వారి కష్టాలు చూసి చనిపోయిన వారి ఆత్మలు ఘోషిస్తున్నాయి.

● ప్రొద్దుటూరు మండల పరిధిలో 15 గ్రామ పంచాయతీలు, వాటిల్లో సుమారు 50కిపైగా గ్రామాలు ఉన్నాయి. 25 సచివాలయాల పరిధిలో 33,908 కుటుంబాలు ఉండగా లక్షకుపైచిలుకు జనాబా ఉంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన అభివృద్ధి చెందిన ప్రొద్దుటూరు నగరానికి సమీపాన ఉన్న గ్రామాల్లోని శ్మశాన వాటికల్లో కనీస వసతులు కరువయ్యాయి. శ్మశాన వాటికకు వెళ్లే దారులు ఉండవు. మృతదేహాలను తీసుకెళ్లాలంటే కిలోమీటర్ల దూరం శ్రమతోకూడి అక్కడికి వెళ్లినా ఎలాంటి షెడ్లు ఉండవు. చేతులు, కాళ్లు కడిగేందుకు కనీసం నీటి సదుపాయాలు లేకపోవడంతో ఇక్కట్ల నడుమ అంతిమ సంస్కారాలు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. మండల పరిధిలో చాలా గ్రామాల్లో కేవలం 10 నుంచి 15 సెంట్ల స్థలాల్లో మృతదేహాలను పూడ్చిపెడుతున్నారు. ఏ ఒక్క శ్మశాన వాటిక కూడా సరైన వసతుల్లేవు. ఎక్కడ చూసినా కంపచెట్లు, ముళ్లపొదలతో ఇవా శ్మశాన వాటికలు అన్న ప్రశ్న తలెత్తుతోంది. అరకొర స్థలంలో ఉన్న శ్మశాన వాటికల స్థలాలను కొంతమంది ఆక్రమించి వరిపైర్లను పండించుకుంటున్నారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసుకున్న కొద్దిపాటి స్థలంలో వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో అంత్యక్రియలు నిర్వహించాలంటే వారి ఇబ్బందులు వర్ణణాతీతంగా మారుతున్నాయి. సమాధుల వద్ద కంపచెట్లు, ముళ్లపొదలు ఏపుగా పెరిగినా వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే చెప్పినా చలనంలేని యంత్రాంగం

చివరి మజిలి సుఖాంతం అయ్యేలా శ్మశాన వాటికలో సమస్యలను తొలగించేందుకు ప్రభుత్వం నుంచి నిధులు తెప్పించి అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి చొరవ చూపారు. ఈమేరకు గత నవంబరు 27వ తేదీన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో శ్మశాన వాటికలు దయనీయస్థితిలో ఉన్నాయని, శ్మశానవాటికల్లో ఉన్న సమస్యలను గుర్తించాలని సూచించారు. శ్మశాన వాటికలు లేని గ్రామాలు, ఉన్నవాటిలో వసతుల కొరత, కబ్జాకు గురైన వాటి వివరాలు తదితర సమగ్ర సమాచారంతో నివేదికలను ఆయా పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు తయారు చేసి పంటల అభివృద్ధి అధికారికి అందజేయాలని ఆదేశించారు. వాటిల్లో భూ సమస్యలు, కబ్జాలు, తదితర అంశాలను రెవెన్యూ అధికారులు పరిష్కారం చూపుతారని నివేదిక సిద్ధం చేసి ఇస్తే ప్రభుత్వం నుంచి నిధులు తెప్పించి శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తానని వెల్లడించారు. ఎమ్మెల్యే అధికారులను ఆదేశించి నాలుగు నెలలు పూర్తయింది. మళ్లీ ఈ నెల 9న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు అధికారులు సిద్ధమైనా ఏ ఒక్క పంచాయతీ నుంచి కూడా నివేదిక తయారు కాలేదు. కొంతమంది అధికారులు ఆదాయ మార్గాల అన్వేషణలో కాలయాపన చేస్తూ గడపేస్తున్నారన్న విమర్శలున్నాయి. శ్మశాన వాటికల నివేదికపై ఈవోపీఆర్డీ రామాంజనేయులు వద్ద ప్రస్తావించగా నివేదికలు తయారవుతున్నాయన్నారు.

ఎంపీడీవో ఏమంటున్నారంటే: సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే నివేదికలు తయారు చేయమని చెప్పారని ప్రొద్దుటూరు ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. పంచాయతీల నుంచి ఇప్పటి వరకు ఎలాంటి నివేదికలు తమకు అందలేదని నివేదికలు వస్తే వాటిలో భూ సమస్యలు, ఆక్రమణలు తదితర వాటిపై రెవెన్యూ అధికారులకు నివేదించి ఆ తర్వాత పూర్తి నివేదిక తయారు చేసి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళతామన్నారు.

శ్రీరాముని కల్యాణానికి ప్రత్యేక బస్సులు

బద్వేలు రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 11న జరగబోయే శ్రీరాముని కల్యాణోత్సవానికి బద్వేలు డిపో నుంచి మధ్యాహ్నం 2గంటల నుంచి దాదాపు 15 ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని ఆర్టీసీ డీఎం నిరంజన్ తెలిపారు. సోమవారం స్థానిక డీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన ప్రజలు ఒంటిమిట్ట శ్రీరాముని కల్యాణోత్సవానికి వెళ్లేందుకు పోరుమామిళ్ల నుంచి ఐదు బస్సులను ఏర్పాటు చేశామన్నారు. దాదాపు 20 ప్రత్యేక బస్సులు, 11వతేదీ మధ్యాహ్నం నుంచి బయల్దేరి కల్యాణం ముగిసిన తరువాత అర్ధరాత్రి వరకు ప్రత్యేక బస్సులు నడుపుతామని ఆయన తెలిపారు. అలాగే చైత్ర పౌర్ణమి సందర్భంగా అరుణాచలం వెళ్లే భక్తులకు ఒక ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశామని, వివరాలకు బద్వేలు ఆర్టీసీ డిపో మేనేజరు సెల్‌నెం.9959225779ను సంప్రదించాలన్నారు.

పేద కుటుంబానికి వాసవీక్లబ్ సాయం



మైదుకూరు రూరల్ ,ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) : పేద కుటుంబానికి వాసవీక్లబ్ ఆర్థిక సాయం అందించింది. జీవి సత్రంలో గత రెండు రోజుల క్రితం ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన లక్ష్మీదేవి అనే మహిళ మృతి చెందింది. ఆమె వాసవిక్లబ్‌లో మెంబరు కావడం వలన ఆమె కుటుంబానికి వాసవీక్లబ్ గవర్నర్ ఇరకుల రాధాకృష్ణ 25 వేల ఆర్థికసాయం చేశారు.ఈ మొత్తన్ని వాసవీక్లబ్ సభ్యులు లక్ష్మీదేవి కుటుంబానికి అందచేశారు. కార్యక్రమంలో నాగరాజు, దేవతి నరసింహులు, బచ్చు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

12న పోలేరమ్మతల్లి విగ్రహ పున: ప్రతిష్ఠ

మైదుకూరు రూరల్ ,ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లె గ్రామంలో వెలసిన పోలేరమ్మతల్లి విగ్రహ పున: ప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 12 నుంచి ఘనంగా ప్రారంభమవుతున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. 12న గోపూజ, నవగ్రహ కలశస్థాపన, శాంతిహోమం,13న చండీహోమం, ధాన్యాధివాసం, 14న విగ్రహ ప్రతిష్ఠ, వృషరాజములచే బండలాగుడు పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ హాజరవుతున్నారని వారు తెలిపారు.

నిందితుల అరెస్టు

ఖాజీపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గత నెల 31వ తేదీన జరిగిన సంఘటనలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ మోహన్ తెలిపారు. సోమవారం పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ పీడబ్ల్యూడీ బంగ్లా సమీపంలో ఉన్న సౌభాగ్యతో ఘర్షణపడ్డ వారు రావులపల్లె చెరువు వద్ద ఉండగా సిబ్బందితో దాడి చేసి సూర్యచంద్రారెడ్డి, షేక్ అహమ్మద్ రఫీలతోపాటు మోటారు సైకిల్ స్వాధీనం చేసుకుని వారిని మైదుకూరు కోర్టుకు అప్పగించడం జరిగిందన్నారు. ఈ దాడిలో హెడ్‌కానిస్టేబుల్ సుబ్రమణ్యం, సిబ్బంది కిరణ్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారన్నారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పనులు చేయిస్తున్న విద్యుత్తు శాఖ ఏఈ

దువ్వూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని మూడు రోడ్ల కూడలి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదాలు జరుగకుండా విద్యుత్తు శాఖ అధికారులు సోమవారం చర్యలు చేపట్టారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఆదమరిస్తే అంతే గతి' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విధితమే. దీనికి స్పందించిన ఆశాఖ ఏఈ వీరారెడ్డి ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాల్లో నీరు నిలువకుండా ఎక్స్‌కవేటర్‌తో పనులు చేయించారు. అటుగా వెళ్లే వ్యక్తులు ప్రమాదాలకు గురికాకుండా చుట్టూ ఇనుపకంచెతో కంచె వేయిస్తున్నట్లు తెలిపారు. దీంతో పరిసరాల్లో తిరిగే వ్యక్తులు 'ఆంధ్రజ్యోతి' కృతజ్ఞతలు తెలియజేయడంతోపాటు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం ఉదయం 11.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు ఓప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ చెరకూరి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

పెద్దముడియం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పంచాయతీ రాజ్ అసోసియేషన్ ఆదేశాలనుసారం పెద్దముడియం మండల పంచాయతీరాజ్ కార్యదర్శుల సంఘం కార్యవర్గ ఎన్నిక సోమవారం జరిగింది. మండల కేంద్రం ఎంపీడీవో సభాభవనంలో మండలంలోని కార్యదర్శులు సమావేశమై కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా కె.బషీర్‌బాషా, ఉపాధ్యక్షుడిగా శశిశేఖర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా షేక్ రిజ్వానా, కోశాధికారిగా ఎం.శైలజ, జనరల్ సెక్రటరీగా మధు, అదనపు సెక్రటరీగా సురేశ్, గౌరవ సలహాదారులుగా నీలావతి, ఇతర కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యుల పత్రాన్ని ఎంపీడీవోకు పంచాయతీ కార్యదర్శులు అం దించారు.

మద్దిమానుగురప్పస్వామి హుండీ లెక్కింపు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్దిమాను గురప్పస్వామి ఆలయ హుండీని సోమవారం లెక్కించినట్లు ఈవో నరసయ్య తెలిపారు. ఐదునెలలకు సంబంధించిన కానుకలు లెక్కించగా రూ.9,07,988లు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమానికి దేవదాయ ఇన్‌స్పెక్టరు కిరణ్‌కుమార్‌రెడ్డి, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ అమౌంటును బ్యాంకులో జమ చేయడం జరుగుతుందని వారు తెలిపారు.

మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఘన స్వాగతం



అట్లూరు క్రాస్ రోడ్డు వద్ద మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు, మహిళలు

అట్లూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి అట్లూరు మండల టీడీపీ నాయకులు, మహిళలు అట్లూరు క్రాస్‌రోడ్డు వద్ద ఘన స్వాగతం పలికారు. ఆయన సోమవారం ఒంటిమిట్ట కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై టీటీడీ అధికారులు, జిల్లా అధికారులతో కలిసి పర్యటించేందుకు వెళుతుండగా మండల టీడీపీ నాయకులు పూలమాలలు, శాలువాలతో, మహిళల హారతులు ఇచ్చి ఆయనకు ఘన స్వాగతం పలికారు. అలాగే ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువ నాయకులు రితీష్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అట్లూరు మండల వాసులంటే తనకు ఎంతో అభిమానమని ఆయన అందరితో మాటామంతిగా తెలిపారు. అట్లూరు బీసీకాలనీవాసులు తమ కాలనీకి నూతన దేవాలయాన్ని నిర్మించాలని వినతిపత్రం అందించారు. వెంటనే ఆయన స్పందిస్తూ ఏవోను మీ వద్దకే పంపుతామని తెలిపారు. ఘన స్వాగతం పలికిన వారిలో టీడీపీ నాయకులు పోతిరెడ్డి రెడ్డయ్య, అరవశ్రీనివాసులరెడ్డిలు ఘన స్వాగతం పలికారు. మంత్రి వెంట టీడీపీ సీనియర్ నాయకులు మంచూరి సూర్యనారాయణరెడ్డి, పెద రామసుబ్బారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నరసింహులు, వెంకటేశ్, అయ్యవారయ్య నరసారెడ్డి కూడా ఉన్నారు.

మంత్రిని కలిసిన పోరుమామిళ్ల సర్పంచ్

పోరుమామిళ్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్ కలిశారు. సోమవారం ఒంటిమిట్ట వెళుతున్న సందర్భంగా బద్వేలులో ఆయనను కలిశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువనేత రితీశ్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చర్మకారుల సంఘం నూతన అధ్యక్షుడిగా మున్నెల్లి



రితేష్‌రెడ్డిని సన్మానిస్తున్న నూతన అధ్యక్షుడు మున్నెల్లి, సంఘ సభ్యులు

బద్వేలు రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త కె.రితేష్‌రెడ్డి ఆదేశాల మేరకు చర్మకారుల సంఘం నూతన అధ్యక్షుడిగా మున్నెల్లి గురయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన అధ్యక్షుడు మున్నెల్లి మాట్లాడుతూ తన తండ్రి కేశవయ్య సంఘ అధ్యక్షులుగా సంఘ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయన మరణానంతరం తనపై నమ్మకముంచి టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రితేష్‌రెడ్డి అధ్యక్షుడిగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం రితేష్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నరసింహులు, కోడూరు ఏసురత్నం, ఎ.ప్రసాదరావు, జాలా రాజన్న, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం కృషి

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ 2025 సంవత్సరానికి ఆరోగ్యకరమైన ప్రారంభం, ఆశాజనక భవిష్యత్తు అనే అంశంపై ముందుకు వెళుతోందన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ హిమబిందు, పాఠశాల హెచ్‌ఎం గురప్ప, సిర్డ్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, చెన్నమ్మ, రమణమ్మ, గంగాభవానీ, అల్లాబకాష్, ఆశాలు పాల్గొన్నారు.

బి.కోడూరులో : వైద్యాధికారి ఉదయకిరన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్యదినోత్సవం నిర్వహించారు. అనంతరం బి.కోడూరు గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ పౌష్టికాహారం, తల్లీబిడ్డ ఆరోగ్యానికి ప్రాణం అనే దానిపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యాధికారి హుసేనయ్య, ఈహెచ్ఎన్ పుష్పాంజలి, సూపర్‌వైజరు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఖాజీపేటలో: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ ఉంచితే ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని డాక్టర్ ఆయేషా సుల్తాన్ అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, వైద్య సిబ్బంది అరుణకుమారి, వెంకటసుబ్బమ్మ, సునీత, రాజేశ్వరి, పద్మావతి పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి

బద్వేలు , ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కోసం మే నెల 15వ తేదిన తిరుపతిలో జరిగే ఏఐవైఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి నవీన్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు లోకేష్, సుధాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నీలాపురం గుట్టలోని సాగు భూములు పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

దువ్వూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం నీలాపురం సమీపంలోని గుట్ట ప్రాంతంలో సాగులో ఉన్నభూములను జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ సోమవారం పరిశీలించారు. ఇక్కడ నీలాపురం, దాసరిపల్లె ప్రాంతాల్లోని వ్యక్తులు గుట్టను చదును చేసి భూములు సాగు చేస్తున్నారు. కొందరు మామిచెట్లు నాటారు. మరికొందరు బోర్లు వేసి ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌కు అక్రమంగా భూములు సాగు చేస్తున్నట్లు ఫిర్యాదులు వెళ్లడంతో ఆమేరకు ఆర్డీవో పరిశీలించారు. ఈ విషయంపై తహసీల్దారు అక్బర్‌బాష మాట్లాడుతూ ఇక్కడ 300 ఎకరాలకుపైగా భూములను రైతులు సాగు చేస్తున్నట్లు చెప్పారు. దాదాపు 15 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారని ఆ విషయాన్ని సాగులో ఉన్న రైతులు ఆర్డీవోకు తెలిపారని వివరించారు. తదుపరి నిర్ణయాలు ఆర్డీవో, కలెక్టర్ పరిధిలో ఉంటుందని చెప్పారు.

అరాచకాలతోనే రాచమల్లుకు ఓటమి



మాట్లాడుతున్న సర్పంచ్, కౌన్సిలర్లు

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చేసిన అరాచకాలతోనే ప్రజలు ఓడించారని కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక విలేకరుల సమావేశంలో శివచంద్రారెడ్డి మాట్లాడుతూ రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఉనికి కోసం ఆరాట పడుతున్నారని విమర్శించారు. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పోలీసుశాఖ, రెవెన్యూ, రిజిస్ట్రార్ కార్యాలయం, మున్సి పాలిటీ ఇలా అన్ని వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకోని శాసించావు మరిచిపోయావా అని రాచమల్లును ప్రశ్నించారు. కొత్తపల్లె పంచాయతీలో వార్డు మెంబర్లను సంతలో కొన్నట్లు కొని ఏం చేయగలి గావన్నారు. వార్డు సభ్యుడిగా పోటీ చేయించి నా కుమారుడు మీద పోటీ పెట్టించి ఏంసాధించావన్నారు. నీమీద వార్తలు రాసినందుకు విలేకరులను ఊర్లు విడిపించావన్నారు. కొందరిని ట్రాక్టర్లతో తొక్కిస్తానని బెదిరించావన్నారు. నీవు చట్టం న్యాయం గురించి మాట్లాడితే.. దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంటుందన్నారు. సమా వేశంలో కౌన్సిలర్లు మురళీధర్‌రెడ్డి, మునీర్‌బాషా, మాజీ జడ్పీటీసీ వెల్లాల భాస్కర్ ,పొట్టు లక్ష్మీరెడ్డి, పగిడాల దస్తగిరి, దుగ్గిరెడ్డి రఘునాధరెడ్డి పాల్గొన్నారు.

హెచ్ఎన్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మృతికి సంతాపం



సంతాపం తెలుపుతున్న రెవెన్యూ అధికారులు

ముద్దనూరు ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి):హెచ్ఎన్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ మృతి పట్ల స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలంలోని యర్రగుంట్ల వద్ద రోడ్డు ప్రమాదంలో పీలేరు ఎస్‌డీసీ రమా మృతి చెందారు. ఈమె 2016 సంవత్సరంలో ముద్దనూరు తహసీల్దారుగా పనిచేశారు. ఈ కారణంగా తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించి ఆమె ఆత్మకు శాంతికలగాలని ప్రార్థించి సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డీటీ, ఆర్ఐ, వీఆర్వోలు పాల్గొన్నారు.

16 న పి.అనంతపురం నిర్వాసితుల ఆధారపత్రాల పరిశీలన

కొండాపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.అనంతపురం గ్రామానికి చెందిన గండికోట నిర్వాసితుల ఆధారపత్రాలను ఈ నెల 16 వతేదీన పరిశీలించనున్నట్లు జమ్మలమడుగు ఆర్డీవో ఆదిమూలంసాయిశ్రీ, తహసీల్దార్ గురప్పలు తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ గెజిట్ (ఎస్ఈఎస్) లో పేర్లు నమోదై గతంలో జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పెషల్ గ్రీవెన్స్‌డేలో ఆధారాలు సమర్పించని 152 మంది నిర్వాసితులు హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఆధారాలు సమర్పించాలన్నారు. ఈ నెల 16న ఉదయం 10 గంటల నుంచి సాయింత్రం 5 గంటల వరకు జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఆధారపత్రాలను పరిశీలించడం జరుగుతుందన్నారు. గెజిట్‌లో ఉన్నవారు 2007 సంవత్సరం నుంచి 2010 వ సంవత్సరం వరకు తమ ఆధారపత్రాలు రేషన్‌కార్డు, ఓటర్‌జాబితా, ఆధార్‌కార్డు, బ్యాంక్‌పాస్‌బుక్, విద్యార్హత, జనన ఇతరత్రా ఆధారపత్రాలతో హాజరు కావాలన్నారు. తప్పుడు ఆధారపత్రాలు సమర్పిస్తే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్డీవో, తహసీల్దార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.

దేశనాయకుల చిత్రపటాల కోసం రూ.50వేలు విరాళం

ఎర్రగుంట్ల, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రహరీకి దేశ నాయకుల చిత్రపటాలు వేసేందుకు పాఠశాల పూర్వ విద్యార్థి బోయపల్లె ప్రసాద్‌రెడ్డి రూ.50వేలు విరాళం ఇచ్చారు. ఈ ప్రహరీని ఇటీవలే దాతల సహకారంతో ఎత్తు పెంచి నిర్మించారు. వాటి ముందభాగంలో సుందరంగా ఉండేందుకు దేశనాయకులు, శాస్త్రవేత్తలు, సంఘసంస్కర్తల, సమాజసేవకుల చిత్రపటాలు వేసేందుకు హెచ్‌ఎం రామాంజనేయరెడ్డి, ఉపాధ్యాయుడు చంద్ర ఓబుళరెడ్డిలు సోమవారం ఆర్థిక సహాయం కోరగా వెంటనే కాదనకుండా రూ.50నగదును ఆయన ఇచ్చినట్లు హెచ్‌ఎం తెలిపారు. ఈకార్యక్రమంలో బోయపల్లె కార్తీక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం మరింత మంది పూర్వవిద్యార్థులు ఎంతో సహకారం ఇచ్చారని వారందరికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు హెచ్‌ఎం తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల్లో సీసీకెమెరాల పర్యవేక్షణ ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాజగోపాల్

బద్వేలుటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు వారి పాఠశాలల్లో పనిచేస్తుండే ఉపాధ్యాయుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూనే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని అర్బన్‌సీఐ రాజగోపాల్, రూరల్‌సీఐ నాగభూషణంలు పేర్కొన్నారు. ఇటీవల పట్టణంలో రెండు ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థినులపై ఉపాధ్యాయులు అసభ్యకరంగా ప్రవర్తించిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం శ్రీసాయివిద్యానికేతన్ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థినులపట్ల మంచి ప్రవర్తనను కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సత్యనారాయణ, శంకర్‌రెడ్డి, రత్నం పాల్గొన్నారు.

పంచాయతీ విస్తరణాధికారిపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ విస్తరణాధికారి రామాంజనేయులరెడ్డిపై చర్యలు తీసుకోవాలని గోపవరం పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డిని కోరారు. ఆ మేరకు సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ పెట్టి ఆరు నెలలు గడుస్తున్నా అందుకు సరైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. జనవరి నెలలో ఎంపీడీవో కార్యాలయం నుంచి విస్తరణాధికారికి తన అర్జీకి సమాధానం ఇవ్వనందుకు షోకాజ్ నోటీసు వెళ్లినప్పటికి ఆయనలో చలనం లేదన్నారు. విస్తరణాధికారిపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు.

కొర్రపాడు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం కొర్రపాడు రోడ్డు విస్తరణ పను లను టౌన్ ప్లానింగ్ అధికారులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విస్తరణకు సమ్మతించిన వ్యక్తుల ప్రహరీగోడలను ఎక్స్‌కవే టర్‌తో అధికారులు కూల్చివేశారు. కొర్రపాడు విస్తరణలో స్థలాలు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్స్‌ను జారీ చేస్తామని మున్సిపల్ అధికారులు వెల్లడించారు. కొందరు యజమానులు టీడీఆర్ బాండ్స్‌ను ఆమోదించిన ప్పటికి మరికొందరు మాత్రం టీడీఆర్ బాండ్స్ లేకుండా నగదు నష్టపరిహారం చెల్లించా లని డిమాండ్ చేస్తున్నారు.

మెప్మా సిటీ మిషన్ మేనేజర్‌గా కెజియా జాస్లీన్

ప్రొద్దుటూరు మెప్మా సిటీ మిషన్ మేనేజర్ గా కెజియా జాస్లిన్ నియమిస్తూ మెప్మా ఎండీ తేజ్‌భరత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ వున్న సీఎంఎం మహలక్ష్మీని మైదుకూరు మున్సిపాలిటీకి బదిలీచేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కెజియా జాస్లీన్ గతంలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీ నుంచే మైదుకూరుకు బదిలీపై వెళ్లారు.